న్యాయవాదుల నిరసన

చార్మినార్, మార్చి 25: న్యాయవాదులపై రోజు రోజుకూ దాడులు పెరిగి పోతున్నాయని సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అడ్వకేట్ ఇజ్రాయిల్‌పై దాడి చేసి హత్య చేసిన ఘటనపై మంగళవారం సిటీ సివిల్ కోర్ట్ ఆవరణలో న్యాయవాదులు నిరసన చేపట్టారు. అనంతరం అయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని అన్నారు. ఓ భయానక వాతావరణాన్ని న్యాయవాదుల చుట్టూ ఏర్పడేలా చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కోర్టులకు హాజరయ్యే న్యాయవాదులు కేసులను వాదిస్తూ కక్షి దారులకు సరైన న్యాయం అందించలేక పోతున్నారని తెలిపారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారని సీనియర్ న్యాయవాది మాణిక్ ప్రభు గౌడ్ విచారం వ్యక్తం చేశారు. గతంలో నగరం లోనే అనేక మంది న్యాయవాదులపై జరిగిన దాడులను పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న దాఖలా లేదని వాపోయారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడుల్లో త్వరిత గతిన నిందితులను గుర్తించి శిక్ష పడేలా పోలీసులు కృషి చేయాలన్నారు. ఇజ్రాయిల్ దాడి చేసిన నిందితుల పక్షాన ఏ న్యాయవాది కేసును వాదించకూడదని బార్ అసోసియేషన్ తీర్మానం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తిరుమల్ రావు, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌రెడ్డి, రాజేశ్‌కుమార్, సుధాంషు కుమార్, విశాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ నీటి దినోత్సవం

ప్రజలు వర్షం నీటిని ఒడిసి పట్టుకోవడానికి ఇంకుడు గుంతలు నిర్మించాలని జలమండలి డివిజన్ 3 జీఎం శీను నాయక్ అన్నారు. మంగళవారం మెహిదీపట్నంలోని భోజగుట్ట శ్రీరామ్ నగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నీటి ఆవశ్యకతను వివరించారు.

– మెహిదీపట్నం, మార్చి 25

లంగర్‌హౌస్ డివిజన్‌లో బీజేపీ నూతన కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఠాగూర్ అమర్ సింగ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యకర్తలు నాయకులకు సూచనలు చేశారు. లోక్సభ కన్వీనర్ అలవాల ఇంద్రసేనారెడ్డి, నాయకులు వినేశ్ సింగ్, పూర్ణ చందర్, డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం, మార్చి 25

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రేమ్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, మార్చి 25 : అంబర్‌పేట నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పాదయాత్రలు చేపడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో పలు శాఖల అధికారులతో కలసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వీధిదీపాల ఏర్పాటు, మంచినీటి సరఫరాలో సమస్యలతో పాటు డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో పాటు ప్రేమ్‌నగర్‌లోని శ్రీశ్రీ నల్లపోచమ్మ గుడి విస్తరణ కోసం స్థలం సేకరించామని అభివృద్ధి కోసం సహకరించాల్సిందిగా గుడి ప్రతినిధులు కోరగా .. గుడి పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి పెద్ద పీట వేసి ఆలయాలకు నిధులు కేటాయించి పునరుద్ధరణ కార్యక్రమాలను చేపట్టి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలను, పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి పరిచారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మైలారం రాజు, భాస్కర్ గౌడ్, ఈశ్వర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు రామారావుయాదవ్, లింగారావు, వంజరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కథల రూపంలో చిత్రాలు గీయడం గొప్పవిషయం

కాచిగూడ, మార్చి 25: పుస్తకాన్ని చదివి వాటిని కథల రూపంలో చిత్రాలను గీయడం గొప్ప విషయమని ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞశర్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బోడుప్పల్‌కు చెందిన 65 ఏండ్ల మాలతి చిన్నతనం నుంచి చిత్రకలను ఒడిసి పట్టుకొని 5 ఏండ్లుగా ఖాళీ సమయాల్లో రామాయణం, మహాభారతం, గరుడ పురాణం లాంటి అనేక అంశాలతో కూడిన పుస్తకాలను చదివి అందులోని చిత్రాలను గీసింది. వాటితో మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను దైవజ్ఞ శర్మ ప్రారంభించాడు. మహిళలు స్థానికులు పాల్గొన్నారు.

మాలతి వేసిన చిత్రాలను తిలకిస్తున్న దైవజ్ఞశర్మ, మహిళలు

మంచినీటి సరఫరాలో సమస్యల పరిష్కారానికి చర్యలు

హైమద్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

గోల్నాక, మార్చి 25: అంబర్‌పేట డివిజన్ లోని పలు ప్రాంతాల్లో ప్రజలను వేధిస్తున్న మంచినీటి సరఫరా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. డివిజన్ లోని హైమద్‌నగర్‌లో కొన్ని రోజులుగా లోప్రెషర్ మంచినీటి సరఫరాతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్న స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన సమస్య పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రంగు సతీశ్‌గౌడ్, మహేశ్‌ముదిరాజ్, బాలరాజుగౌడ్, అజార్, పాషా, సంతోష్‌చారి, స్థానిక బస్తీ వాసులు నిర్మల, మాధవి, జ్యోతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన ఉత్సవ సమితి

అబిడ్స్ మార్చి 25 : రాబోయే శ్రీరామ నవమిని పురస్కరించుకొని భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ప్రతినిధులు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిశారు. సమితి చైర్మన్ డాక్టర్ భగవంత రావు ప్రధాన కార్యదర్శి గోవింద్ రాటి, మాజీ కార్పొరేటర్లు మెట్టు వైకుంఠం, పరమేశ్వరి సింగ్, నాయకులు మహేందర్ వ్యాస్, శ్రీరామ్ వ్యాస్, ఆనంద్ సింగ్, పప్పు మాత్రే, రామరాజు, నారాయణ తదితరులు కమిషనర్‌ను కలిసి ఊరేగింపునకు అనుమతి ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి ఉత్సవ సమితి ద్వారా భారీ ఊరేగింపు ఉంటుందని, నగరంలోని శ్రీరామ భక్తులు అధికసంఖ్యలో తరలి రావాలని కోరారు.

దోమల నివారణపై ప్రభుత్వం నిర్లక్ష్యం

లంక వాసులతో కలసి ఆందోళనలో పాల్గొన్న కార్పొరేటర్ దూసరిలావణ్యశ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, మార్చి 25: గోల్నాక డివిజన్ లోని పలు ప్రాంతాల్లో దోమల విజృంభణ పెరిగిపోయి. పగలు, రాత్రి తేడా లేకుండా స్వైర్య విహారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గోల్నాక తులసీరాంనగర్ లంకలో ప్రధాన సమస్యగా మారిన దోమల బెడదపై మంగళవారం ఆమె స్థానికులతో కలసి ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కనీసం కంటి నిండా కునుకులేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యంగా రహదారులలపై డ్రైనేజీ చేరి దోమలకు ఆవాసాలుగా మారాయన్నారు. స్థానికులు అవస్థలు పడుతూ వైరల్ జ్వరాలు వెంటాడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జీహెచ్ ఎంసీ ఎంటామాలజీ విభాగంలో అధికారుల తీరు ఇలా ఉంటే ఇతర శాఖల పరిస్థితేమిటని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

అభినందన భవాని సేవలు చిరస్మరణీయం

రవీంద్రభారతి, మార్చి 25 : సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక సేవా రంగంలో నాలుగు దశాబ్దాలుగా అభినందన భవాని అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. తెలుగు నేలపై సాంస్కృతిక సంస్థను నెలకొల్పి సేవలందిస్తున్న తొలి మహిళా మూర్తి అభినందన సంస్థ వ్యవస్థాపకురాలు భవాని నాలగు దశాబ్దాల సాంస్కృతిక జీవిత మహోత్సవ కార్యక్రమం సంగమం ఫౌండేషన్ అధ్యక్షుడు సినీ పరిశోధకుడు సంజయ్‌కిశోర్ ఆ ధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రఖ్యాత నాట్య కళాకారిణి మంజుల భార్గవి హాజరై మాట్లాడుతూ.. ఒక మహిళా నాలుగు దశాబ్దాలుగా సాంస్కృతిక రంగాలలో రాణించడం అభినందనీయమని అన్నారు. మాజీ మంత్రి సన్నపనేని రాజకుమారి మాట్లాడు తూ.. ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొని నిలబడిన ధీరవనిత భవాని అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సినీనటి రోజారమణి, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీరామరాజు, సినీ దర్శకుడు రేలంగి నరిసింహారావు, జబర్దస్త్ సునామి సుధాకర్, గాయని విజయలక్ష్మి తదితరులు పాల్గొని అభినందన భవానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భవానిని గజమాల, జ్ఞాపితో సత్కరించారు. అనంతరం భవాని మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా తనను నడిపిస్తున్న దాతలు, కళాకారులు, ఆత్మీయులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభకు మందు గాయని, గాయకులు ఆలపించిన సినీగీతాలు ఆలరించాయి.



అభినందన భవానిని గజమాలతో సత్కరిస్తున్న సినీనటి మంజుభార్గవి, డా. వంశీరామరాజు, సంజయ్‌కిశోర్

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని నిరసన ప్రదర్శన

ఢిల్లీలో..వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న అంబేద్కర్ ఫొటో సాధన సమితి

రవీంద్రభారతి, మార్చి 25 : కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నేటి ఉదయం 9 గంటలకు వందలాది మంది కళాకారులతో భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహిస్తామని అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ సలహాదారు, ఓబీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లోలోని అంబేద్కర్ భవనం వద్ద ధూం ధాం వాల్ పోస్టర్‌ను ఆయన కళాకారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరెన్సీ నోట్లపై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటో వేయాలని అనేక పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంబేద్కర్ ఫొటో వేయాలని దేశంలోని అన్ని బహుజన పార్టీలు, మేధావులు, విద్యార్థులు కోరినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తక్షణమే స్పందించి కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటోను వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధూం ధాం కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున కళాకారులు , మేధావులు, విద్యార్థులు విచ్చేసి ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాచిగూడ ఆరెకటిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి

కోఠి లోని ఐఎంఏ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కాచిగూడ అరెకటిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆ సంఘం నాయకులు జీ సంజయ్‌రాజ్, పవన్‌రాజ్ తదితరులు

జియాగూడ, మార్చి 25 : 33 సంవత్సరాలుగా ఎన్నికలు జరగని కాచిగూడా అరెకటిక సంఘానికి ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామని తెలంగాణ ఆరెకటిక ట్రస్ట్ స్పష్టత ఇచ్చింది. కోఠి లోని ఐఎంఏ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కాచిగూడ అరెకటిక సర్వ సభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ అరెకటిక ట్రస్ట్ చైర్మన్ నర్సింగ్ రావు, వైస్ చైర్మన్ నేతికర రవి, శ్రీనివాస్‌లకు కాచిగూడ ఆరెకటిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని కాచిగూడ ఆరెకటిక సంఘం నాయకులు లకు జీ సంజయ్ రాజ్, పవన్‌రాజ్, జి. అశోక్, డి. ఉదయ్ కుమార్ జి.గోవిందరాజులు ట్రస్ట్ నాయకులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ జి.నర్సింగ్‌రావు, వైస్ చైర్మన్ నీతికార రవి మాట్లాడుతూ.. త్వరలోనే కాచిగూడ ఆరెకటిక సంఘానికి ఎన్నికల నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కాచిగూడ ఆర్య కటిక సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాచిగూడ ఆరెకటిక సంఘం ప్రతినిధులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం..వ్యక్తి అరెస్ట్

కాచిగూడ, మార్చి 25: పెళ్లి చేసుకుంటానని గృహిణికి మాయమాటలు చెప్పి, సహజీవనం చేసి ముఖం చాటేసిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ తల్లోజు జోత్స్న తెలిపిన ప్రకారం.. గోల్నాక కూరగాయల మార్కెట్‌కు చెందిన రాజేంద్ర ప్రసాద్ జస్వాల్ కుమారుడు రితీశ్ ప్రసాద్ జస్వాల్ (37) బ్యాండ్ కంపెనీలో పనిచేస్తాడు. అదే ప్రాంతానికి చెందిన వేములా దేవి(31) భర్త అనారోగ్య కారణాలతో మూడేళ్ల క్రితం చనిపోయాడు. రెండేండ్ల క్రితం వేములా దేవికి రితీశ్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. దీంతో రితీశ్ ఆమెను నమ్మించి ఆమెతో 18నెలల పాటు సహజీవనం చేశాడు. అయినప్పటికీ పెండ్లి మాట ఎత్తడం లేదు. అనుమానం వచ్చిన వేములా దేవి తనను పెండ్లి చేసుకోవాలని రితీశ్‌ని నిలదీసింది. దీంతో మొఖం చాటేశాడు. మోసపోయినట్లు గ్రహించిన వేములాదేవి సోమవారం రాత్రి నిద్రమాత్రలతో పాటు విషం తాగింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మేములాదేవిని గాంధీ దవాఖానలో చేర్పించి, రితీశ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు మంగళవారం కాచిగూడ సీఐ తెలిపారు. అయితే వేములాదేవి కోలుకుంటున్నట్లు తెలిసింది.

రైల్లోంచి జారిపడి వ్యక్తి మృతి

కాచిగూడ, మార్చి 25: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణచారి వివరాల ప్రకారం బీహార్‌కు చెందిన మహమ్మద్ ఆలాం కుమారుడు సోహెల్ అహ్మద్ (38) టైలర్, రైళ్లల్లో తినుబండారాలు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం సికింద్రాబాద్ నుంచి మలక్‌పేటకు వెళ్లే ఎంఎంటీఎస్ రైల్లో వస్తుండగా నింబోలి అడ్డ రైల్వే ట్రాక్ సమీపంలో ప్రమాదవశాత్తు రైల్లోంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దావఖానకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు లక్ష్మణచారి తెలిపారు.

నీలోఫర్‌లో నిరుపయోగంగా పుట్‌ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్

నిరుపయోగంగా ఉన్న పుట్‌ఓవర్ బ్రిడి లిఫ్ట్

బాగుచేయాలని వేడుకుంటున్న రోగుల బంధువులు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 25 : చిన్నపిల్లలు, ప్రసూతి దవఖానగా పేరున్న నీలోఫర్ దవాఖాన భవనాలను అనుసంధానం చేస్తూ జీహెచ్ఎంసీ నిర్మించిన పుట్‌ఓవర్ బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. నీలోఫర్ పాతభవనం నుంచి ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ భవనంలోకి రోగులు, వారి సహాయకులు, ఉద్యోగులు ఆయా పనుల నిమిత్తం రాకపోకలు సాగించాలంటే ఆ భవనాల మధ్యన ఇరుకైన రోడ్డు మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణతో పాటు దవాఖానకు వచ్చే వారికి సౌకర్యవంతంగా ఉండేలా రెండు సంవత్సరాల క్రితం జీహెచ్ఎంసీ తన సొంత ఖర్చులతో రెండు భవనాలను కలుపుతూ పుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించింది. మెట్ల మార్గం ద్వారా పైకి వెళ్లి రాకపోకలు సాగించడంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఇరువైపులా లిఫ్ట్‌లను ఏర్పాటు చేసారు. కానీ వాటి నిర్వహణ మాత్రం ఓ కాంట్రాక్టర్‌కు అప్పజెప్పి చేతులు దులుపుకున్నారు.లిఫ్ట్‌లను ఆపరేట్ చేసే విషయంలో పర్యవేక్షణ లేకపోగా అవి అలంకార ప్రాయంగా మారాయి. ఆపసోపాలు పడుతూ మెట్లపై నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వైద్యం కోసం వచ్చేవారు తొందరలో రోడ్డు దాటుతూ రద్దీగా ఉండే దారిలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైపా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి పుట్‌ఓవర్ బ్రిడ్జికి అనుసంధానంగా ఉన్న లిఫ్ట్‌లను పునరుద్ధరించాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

నీలోఫర్ పాత భవనం, ఇంటెన్సీవ్ కేర్ యూనిట్ భవనాలను అనుసంధానం చేస్తూ రోగులు, వారి సహాయకులు, దవఖాన ఉద్యోగులు ప్రమాదాల బారిన పడకుండా జీహెచ్ఎంసీ పుట్‌ఓవర్ బ్రిడ్జితో పాటు లిఫ్ట్‌లను ఏర్పాటు చేసింది. కానీ నిర్వహణను గాలికి వదిలేసింది. సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడం మంచి పద్ధతికాదు. వెంటనే లిఫ్ట్‌లను పనిచేసేలా కాంట్రాక్టర్ చర్యలు చేపట్టేలా జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎన్. రవికుమార్, సూపరింటెండెంట్

నేటి నుంచి రసరంజని నాటకోత్సవాలు

నాటకోత్సవాలను ప్రారంభించిన వక్తలు వోలేటి పార్వతీశం, నటరాజ్, సారిపల్లి కొండలరావు తదితరులు

రవీంద్రభారతి, మార్చి25 : అంతరించి పోతున్న పౌరాణిక, పద్యనాటకాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. రసరంజని ఆధ్వర్యంలో కళాతపస్వీ కోటి సుబ్బరాజు రచన, దర్శకత్వం వహించిన నర్తనశాల నాటక ప్రదర్శన రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ప్రముఖ సాహితీవేత్త వోలేటి పార్వతీశం పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి నాటకోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసరంజని సంస్థ నాటకోత్సవాలను నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పౌరాణిక నాటకాలను భవిష్యత్ తరాలకు అందించాలని అన్నారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో తెలంగాణ నాటక సమజాల సమైక్య కార్యదర్శి సాదు శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నటినటులు బాబురాజు, ఉప్పలూరి రఘురాం, డీఎస్సీ రావ్ , బుంగ బల్లికీర్జునయ్య, ఆమూరి సుబ్రమణ్యం, మేగల గంగయ్య, శ్రీ.శ్రీధర్, ఓలేటి చంద్రబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల అరెస్ట్

చార్మినార్, మార్చి 25 : పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తులను సౌత్, ఈస్ట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీ అందే శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం.. అజాంపురాకు చెందిన మహమ్మద్ అబ్దుల్ రహీమ్ అలియాస్ స్పెరోజ్ (42) స్థానికంగా ఉంటూ ప్రజలకు కుచ్చు టోపీ పెట్టి తప్పించుకు తిరుగుతున్నాడు. నిందితునిపై నగరంతోపాటు సైబరాబాద్, రాచ కొండా పోలీస్ కమిషనర్ పరిధిల్లో 10 కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితునిపై 4 నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం చాదర్ ఘాట్ పోలీసులకు అప్పగించామని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ సైదాబాబు తెలిపారు.

బండ్లగూడ పరిధిలో.. అలీ బిన్ మహమూద్ జాబ్రీ అలియాస్ అలీ జాబ్రీ పై బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో భూ కబ్జాలతోపాటు బెదిరింపులు, ఫోర్జరీ, హత్యయత్నాలతో కలిపి 21 కేసులు ఉన్నట్లు తెలిపి. 11 నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. సమాచారం అందడంతో అతని ఇంటిపై దాడిచేసి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం బండ్లగూడ పోలీసులకు అప్పగించామని అన్నారు.

చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో.. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే తరుణ్ సాయి నంద కిశోర్ అలియాస్ సత్యనారాయణ (45) సత్య, కిశోర్ , అక్షయ్, రాజేశ్‌కుమార్, శేషాద్రికుమార్, సంజయ్ కుమార్ నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధుల్లో 35 కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. కిశోర్ కుమార్ పలువురిని మోసం చేసి పేర్లు మార్చుకుంటూ 19 సంవత్సరాలు గా పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. నిందితునిపై 9 నాన్ బెయిలబుల్ వారెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ లోని ఆగాపురాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ సర్కిల్ 12 ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం తెల్లవారుజామున కమ్యూనిటీ హాల్ పైకప్పు నిర్మాణ పనులు చేశారు. ఈ పనులను ఎంఐఎం నాయకుడు జాఫర్ ఖాన్ పరిశీలించారు.

– మెహిదీపట్నం, మార్చి 25

ఇఫ్తార్ విందు

రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే వారికి ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్వాన్ ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. గోల్కొండలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, ఇన్స్పెక్టర్ సైదులుతో కలిసి పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 25

గోషామహల్ నియోజకవర్గంలోని జాంబాద్ డివిజన్లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రెహమత్ బేగ్ ఖాద్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపవాస దీక్ష ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు జాఫర్ ఖాన్ పాల్గొన్నారు.

– ఆబిడ్స్, మార్చి 25

శోభాయాత్రను విజయవంతం చేయాలి

కాచిగూడ, మార్చి 25: వచ్చేనెల ఆరవ తేదీన నిర్వహించే శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమా యాదవ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ శ్రీరామ శోభాయాత్రలో పాల్గొని భక్తిని చాటుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌యాదవ్, వాసు, దిలీప్, సంతోష్, భీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.